# కల నిజమాయెగా!

ఎమ్మెల్యే ఎన్నికల్లో ఏకగ్రీవంగా గెలిచిన తీరుతానన్న ధీమాతో నామినేషన్ వేసి, డిపాజిట్ పోగొట్టుకున్న ప్రజాప్రతినిధిలా 'సోఫాలో ముడుచుక్కూచ్చున్న అర్ధాంగి ఎదురుగా కనబడగానే రాకేష్ యువ హృదయం వైరస్ సోకిన కంప్యూటర్లాగైంది.

రోజూ తాను ఆఫీసు నుండి రాగానే చిరునవ్వుల సింగారముతో ఎదురొచ్చే అందాల బొమ్మకీరోజు ఏమైందీ? పెళ్ళై ఆర్నెల్లు కాకముందే నిర్లక్ష్యం నీడ సోకిందా? లేక పరాకు పడగెత్తిందా?

"ఏమైంది అరవిందా? అలా కూచున్నావేందీ? మొహం చూడు. రంగు వెలసిన పట్టుగుడ్డలాగైంది. ఆలస్యంగా వచ్చానని అలకా?" లాలనగా అడిగాడు.

"అలకా, గిలకా కాదు" మూతి మూడు వంకర్లు తిరిగింది. "మరేంటటా? కొన్ని తరాలు తిన్నా తరగని ఆస్తిపాస్తులున్నాయి. పెద్దల అజమాయిషీ లేదు. రాజభవనం లాంటి బంగలాలో ఇద్దరమే....." పక్కన కూచున్నాడు.

ఎదురుగా టి.వి.లో ఏదో మహిళా కార్యక్రమం నడుస్తోంది గాని అరవింద చూడ్డంలేదు. మెల్లగా కదిలింది.

"అన్నీ బాగానే ఉన్నాయి గాని అల్లుని నోట్లో శని ఉందన్నారుగదా!"

"అని.... ఎవరన్నారు? మీ పుట్టింటి వాళ్ళేమన్నా..."

"వాళ్ళంతా నిక్షేపంలాగున్నారు. మావాళ్ళెప్పుడూ నా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కడ్డురారని తెలుసు గదా!"

రాకేష్ ఆలోచనలు రాకెట్ స్పీడందుకున్నాయి.

"నిజమే కాని ఇవ్వాళ్ళ నీకేమైంది డియర్?" లోపల గూడుకట్టుకున్న ఆందోళన చెదిరి పోకుండా జాగ్రత్త పడుతూ అద్దాల్లాంటి చెక్కిళ్ళను అరచేతుల్తో నిమిరాడు.

అరవింద సర్దుక్కూచుంది. మొహం పంచరంగుల చిత్రమైంది. దొండపండు పెదాలు సన్నగా వణుకుతున్నాయి.

"మీరు పొద్దున కారు స్టార్టు చేసుకుని అటు ఆఫీసుకెళ్ళగానే ఇటు నాకు కళ్ళు తిరిగినై. ఒంటి మీద స్పృహ లేదు. సోఫాలో కూలబడ్డాను. మెలకువ వొచ్చింతర్వాత వాంతి అయింది గూడా. వెంటనే ఫోన్ చేసి లేడీ డాక్టర్ని పిలిపించుకున్నాను....."

"అరరే! నాగ్గూడా ఫోన్ చెయ్యొద్దా?"

"ముందు చెప్పేది వినాలి. లేడీ డాక్టర్ ఏవేవో పరీక్షలు చేసి చావు కబురు చల్లగా చెప్పింది".

"చఛా.... చావు కబురా? అం....టే?" గుండె గుబగుబ.

"అదేనండీ..... నేను నెల దప్పానట. తమరు తం(డ్రి కాబోతున్నారటా". కాటుక కనురెప్పలు తుమ్మెద రెక్కల్లా టపటపలాడ్తుంటే గొంతులో ఏదో ఇరుక్కున్నట్లైంది.

రాకేష్ నరాలు ఆనంద స్వరాలు వినిపించినై. ఉత్సాహం ఉప్పొంగింది. "వావ్!" అమాంతం కౌగిట్లో బంధించాడు. "అంత తీపి కబురు ఇంత చేదుగా చెప్పాలా? ఇదన్యాయం అరవిందా!" బుంగమూతి.

"అబ్బా! ఇది పగలు" బంధ విముక్తురాలైంది. టీపాయ్ మీదున్న ఆనాటి న్యూస్ పేపరందుకుని ముఖానికి అడ్డంగా పెట్టుకుంది. ఓ సిగ్గుల పొంగులు, మరోవైపు అంతరాళాల్లో అల్లకల్లోలం.

పేపర్ లాక్కుని పక్కన పడేశాడు. ఎ(రబారిన బుగ్గల మీద ముద్దులు వడ్డించాడు. "వారెవ్వా! నాకల నిజం కాబోతుంది సుమా! మా నాన్న కోటీశ్వరుడైనా నేనొక్కడినే వారసుణ్ణి. నాకూ వారసుడు పుట్టబోతున్నాడు. థాంక్యూ డియర్!" చేతులందుకుని తన చెంపల కద్దుకున్నాడు.

అరవిందలో అలౌకికానందం, ఆ స్పర్శ కమ్మగా ఉంది. కాని..... అసలు విషయం తెలిస్తే నన్నసహ్యించుకుని ఇంట్లోంచి గెంటేస్తాడేమో! కానీ ... ఇప్పుడు చెప్పక తప్పదు. చూపులు శూన్యంలో తచ్చాడుతున్నాయి.

వెంటనే తన విషయం బు(రలో మెరిసింది రాకేష్‌కు. లోలోపల నీలినీడలు కమ్ముకుంటున్నాయి. నరాల్లో (ప్రవహిస్తుంది రక్తమా, నీరా? చేతులు డీలాపడిపోయినై. భార్య చేతుల నొదిలేసి.

"చెప్పు అరవిందా! నీ ముఖమ్మీద సంతోషం ఛాయలే లేవు. కారణమేమిటో?" పక్కకు జరిగి సోఫాకు జారగిలపడ్డాడు. అతని వాలకం అర్థాంగిని ఆశ్చర్యంలో ముంచెత్తింది.

"నేను..... ఎయిడ్స్ రోగినండీ!" చెబుతూంటే ఆమె మనోసాగరములో అలజడి ఉధృతమైంది. మొదట గొల్లుమంది. ఆ తర్వాత వెక్కివెక్కి ఏడుస్తోంది.

రాకేష్ నిర్వేదంగా నవ్వేశాడు. తనను తాను నియంత్రించుకుంటూ భార్యను పొదివి పట్టుకున్నాడు. చేతిగుడ్డతో కళ్ళు అద్దాడు. పొంగుల హంగుల్ని గుండె గూటిలో బందీ చేసుకోగలిగాడు.

"నిజమా? అదెలా?" అడగ్గలిగాడు.

"అవును, నిజమే, నేనోసారి మా అమ్మమ్మ ఊరెళ్ళాను. అదో మారుమూల పల్లెటూరు. వర్షంలో తడిశాను. జలుబుతో జ్వరమందుకుంది. ఆ ఊళ్ళో అందుబాటులో ఉన్న వైద్యుడు ఇంజక్షన్ చేశాడు. సిరంజి నీడిల్ ఏది ఉపయోగించాడో ఏమోగాని కొన్ని రోజుల తర్వాత వాసవి క్లబ్ వారి రక్తదాన శిబిరములో రక్తదానమిద్దామని వెళ్లాను. అందరికి లాగే నా శాంపుల్ రక్తాన్ని పరీక్షించారు. ఆ తర్వాత నాది హెచ్.ఐ.వి. పాజిటివ్ వచ్చిందని చెప్పారు. నెత్తి మీద పిడుగు పడ్డట్లైంది. ఇంటికొచ్చి నా గదిలో కూచుని తనివిదీరా ఏడ్చాను. కాని పెళ్ళి చేసుకుని, సంసార సుఖాన్ననుభవించిం తర్వాతనే చావాలని వింత కోర్కె బలపడింది. అప్పుడే పార్కులో మీతో పరిచయం కావడం, మనసులిచ్చి పుచ్చుకోవడం, కలిసి తిరగడం...'

"గతాన్ని ప్రస్తావించక పోవడం, మనం పెళ్ళి చేసుకోవడం చకచకా జరిగిపోయినై". యధాలాపంగా అనేసి చెంపల్ని ప్రేమగా నిమిరాడు.

ఇదేమిటీ, ఈయన నన్నసహ్యించుకోవడం లేదే! ఆశ్చర్యంగా ఉంది.

"ఇప్పుడు నేనంటే మీకేమనిపిస్తుంది? నా నుంచి దూరంగా పారిపోవాలని పిస్తుందా?" అమాయకంగా అడుగుతూంటే ముద్దబంతి మొహం ప్రశ్నార్థకమైంది.

"లేదు. ఇంకా దగ్గరవ్వాలనిపిస్తుంది అరవిందా!"

"షాక్ తిన్నట్లైంది. ఏం? ఎందుకలా?"

కళ్ళలోకి సూటిగా చూశాడు. కౌగిట్లో చేర్చుకుంటూ "ఎందుకంటే నేను గూడా ఎయిడ్స్ పేషెంటునే" చప్పున విడిపోయింది. "అదెట్లా?" మెదడు పొరల్లో పుట్టబోయే బిడ్డ గురించి ధ్యాస ప్రారంభమైంది.

గమ్మత్తుగా నిట్టూర్చాడు.

"ఓసారి మిత్రులతో గోవా వెళ్ళాను. బీచ్‌లో స్వేచ్ఛగా విహరించాము. బాగా తాగాము. గదిలో కిరాయి యువతితో ఎంజాయ్.... అదో విషబీజము. కొద్ది రోజుల తర్వాత లయన్స్ క్లబ్ వారి రక్తదాన శిబిరములో రక్తమిచ్చేందుకు కెళ్లాను. నీ అనుభవమే నా అనుభవమైంది. హెచ్.ఐ.వి. పాజిటివ్ రక్తం తీసుకోరు. నెత్తికొట్టుకున్నాను. కాని పెళ్ళి చేసుకుని వంశోద్ధరణ కోసం ఓ బిడ్డను కనాలనే ఆరాటాన్నణచుకోలేక పోయాను. అలాగని ఓ ఆడదానికన్యాయం

చెయ్యొద్దని నిర్ణయించుకున్నాను. మన పెళ్ళికి ముందే నీకు రక్త పరీక్ష చేసిన నా ఫ్రెండు ద్వారా నువ్వో ఎయిడ్స్ పేషెంటువని తెలిసింది. కావాలనే నీ వెంటబడి పెళ్ళి చేసుకున్నాను".

"కానీ ఏం లాభం!" నోరెల్లబెట్టింది. అంతరాళాల్లో ఆందోళనా తరంగాలు ఏమనాలో అర్థంగాక దుఃఖం పొంగుకొచ్చింది. ఇదంతా నా ఖర్మనండీ! పుట్టబోయే బిడ్డ ప్రాణాలు హరించే పాపం మనను వెంటాడుతుంది. అదంతా ఊహించారా?" తలబాదుకుంది.

"ఆగు... అంతా ఊహించాను" చేతుల్ని గట్టిగా పట్టుకున్నాడు. గాజుల గలగలలు సాంత్వన వచనాలైనాయి. "మనకు పుట్టబోయే బిడ్డ ప్రాణాలకేమీ ఢోకాలేదు". ఆ రోజు పత్రిక తీసి ఓ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రకటన చూపించాడు.

ఆబగా చదివేసింది.

"ఆ! నిజమా? మనం ఎయిడ్స్ పేషెంట్సుమైనా అది మన బేబీకి సోకకుండా..... వైద్య ముందన్నమాట. మన వంశాంకురముకేమీ ప్రమాదం లేదన్న మాట. "సంతోషాన్నాపు కోలేక భర్త గుండెల మీద ఒరిగి పోయింది. నీరసం నిర్వీర్యమైంది.

రాకేష్‌కు అష్టైశ్వర్యాలు అనుకోకుండా లభించినంత సంతోషంగా ఉంది.

"పద అరవిందా! ఇప్పుడే ఆ హాస్పిటల్ కెళ్దాం!" చెయ్యిబట్టి లేపాడు.

"పదండి. మీరు కారు స్టార్టు చెయ్యండి. ఈ శుభవార్త తియ్యని అనుభూతినిచ్చింది. ఇహ నాకేమైనా ఫరవాలేదు. పదండి" తెగింపు... ధైర్యంతో భర్త వెంట నడిచింది.

('కళాదీపిక' మినీకథల పోటీలలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ)

*(జనవరి-ఫిబ్రవరి 2009)*